సాక్షి
కుమురంభీం
గురువారం । 15 । జూన్ । 2023



నిఘా నీడలో అడవి

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ నిఘా నీడలో ఉంది. వన్యప్రాణులను నిత్యం పరిశీలించేందుకు సీసీకెమెరాలు అమర్చారు. 4లో▸



ప్రయాణ తిప్పలు తప్పవా..?

దహెగాం మండల ప్రజలకు ఈ ఏడాది ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. అందవెల్లి వంతెన పిల్లర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 5లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.7 /30.8

చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి కూడా వేడి సెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో 80 సీట్లు, నాలుగో తరగతిలో 45, ఐదో తరగతిలో 6, ఆరో తరగతిలో 28, 9వ తరగతిలో 9 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కొలాం, మన్నె, తోటి తెగలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఐల బదిలీల్లో మార్పులు

ఆసిఫాబాద్: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పలువురు బదిలీ అయ్యారు. ఈ నెల 13న జరిగిన బదిలీల్లో మార్పులు చేస్తూ ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని సీసీఎస్ నుంచి మహబూబాబాద్ డీసీఆర్‌బీకి బదిలీ అయిన ఎల్.పవన్‌కుమార్‌కు తిరిగి ఆసిఫాబాద్ సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పొన్నం సత్యనారాయణ రామగుండంకు, జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు బదిలీ అయ్యారు. సీఐ రామకృష్ణ స్థానంలో జైనూర్ సర్కిల్‌కు జి.మల్లేశ్ ఇన్‌స్పెక్టర్‌గా రానున్నారు.

విద్యార్థులు బస్‌పాసులకు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని కళాశాల, పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచిత బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఎం శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాల లోపు బాలురు, ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు 20 కిలోమీటర్ల వరకు ఉచిత బస్సుపాసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు https://online.tsrtcpass.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగా బస్టాండ్‌లోని కౌంటర్‌లో పాఠశాల/కళాశాల పేరు, ప్రధానోపాధ్యాయుల పేరు, మెయిల్ ఐడీ తెలియజేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాల/కళాశాల యాజమాన్యాలు ఆర్టీసీకి అడ్మినిస్ట్రేటివ్ చార్జెస్ అకౌంట్ ఆఫీసర్, టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ పేరుతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డీడీ తీసి డిపో కార్యాలయంలో అందించాలన్నారు. డీడీ ఇచ్చిన తర్వాతే యూజర్ ఐడీకి మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ హయాంలోనే ఆర్థికాభివృద్ధి

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ హయాంలో భారత దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో బుధవారం మోర్చాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను బుధవారం డీఈసీ బృందాలు పరిశీలించాయి. మూడోరోజు మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పరీక్షలు నిర్వహించినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. ఫస్టియర్ జనరల్ విభాగంలో 601 మంది విద్యార్థులకు 551 మంది హాజరుకాగా, ఒకేషనల్ విభాగంలో 53 మందికి 47 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షలకు జనరల్ విభాగంలో 200 మంది విద్యార్థులకు 192 మంది, ఒకేషనల్ విభాగంలో 51 మందికి 47 మంది హాజరయ్యారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. జిల్లాలో రెండు డివిజన్లలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలిరోజు నిర్వహించిన పరీక్షకు 306 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 206 మంది హాజరయ్యారని, వంద మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈవో అశోక్ పర్యవేక్షించారు.

జాడలేని చినుకు!


వాంకిడి మండలంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

- జిల్లాలో ఇప్పటికీ వేసవి పరిస్థితులే..
- 40 డిగ్రీల పైనే పగటి ఉష్ణోగ్రతలు
- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపు
- పత్తిసాగుకు దుక్కులు సిద్ధం
- సమృద్ధిగా వర్షాలు పడ్డాకే విత్తనాలు వేసుకోవాలని అధికారుల సూచన

ఆసిఫాబాద్: జూన్ సగం పూర్తయింది. ఈ నెల మొదటి వారంలోనే రావాల్సిన నైరుతి రుతుపవనాలు నత్తనడకన కదులుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాను తొలకరి పలకరించలేదు. వర్షాలు పడాల్సిన సమయంలో జిల్లావ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో నమోదవుతున్నాయి. బుధవారం కూడా కాగజ్‌నగర్ మండలం జంబుగాలో 43.4 డిగ్రీలు, దహెగాం మండలం కుంచవెల్లిలో 43.4 డిగ్రీల ఎండ ఉంది. సాగు పనులతో బిజీగా గడపాల్సిన రైతులు వేడి, ఉక్కపోతతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేసవి దుక్కి దున్ని తొలకరి వాన పడితే విత్తనాలు విత్తుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే చాలా మంది సాగుకు అవసరమైన పత్తి, ఇతర విత్తనాలు కొనుగోలు చేసుకున్నారు.

పెరగనున్న పత్తి సాగు..

జిల్లాలో ఈ ఏడాది 4,55,038 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర రూ.8,558 పెంచుతున్నట్లు ప్రకటించింది. దీనికి తోడు ఈ నెల 24న జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా రైతులకు పోడు పట్టాలు అందించనున్నట్లు సమాచారం. దీంతో వ్యవసాయశాఖ అంచనా వేసిన దానికంటే పత్తి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. మే చివరివారం నుంచే రైతులు విత్తనాల కొనుగోళ్లు ప్రారంభించారు. రైతులు పత్తి వైపు మొగ్గు చూపుతుండటంతో మార్కెట్‌లో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. కొంత మంది వ్యాపారులు రైతులు ఆసక్తి చూపే కంపెనీ విత్తనాలను ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి రూ.200 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వానాకాలం సాగు ప్రణాళిక

పంట	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
పత్తి	3,42,000
వరి	58,780
జొన్న	2,962
మొక్కజొన్న	855
కంది	35,000
పెసర	3,017
మినుము	387
వేరుశనగ	180
సోయాబీన్	9,657
ఇతర	2,200

వర్షాధారంగానే పంటలు..

జిల్లాలో వట్టివాగు, కుమురంభీం, జగన్నాథ్‌పూర్, ఎన్టీఆర్, పీపీరావు వంటి ప్రాజెక్టులు ఉన్నా ఆయకట్టుకు సాగు నీరందని పరిస్థితి. చెరువుల పరిస్థితి ఇలాగే ఉండటంతో జిల్లా రైతులు దాదాపు 80– 85 శాతం మంది వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. పత్తి, కంది సాగు అధికంగా ఉంటుంది. వరి సాగు కేవలం కొన్ని మండలాలకే పరిమితమవుతుంది. ఇప్పటికే కొంత మంది పత్తి విత్తనాలు విత్తుకున్నారు. వర్షం వస్తే మొలకలు వస్తాయి.. లేకుంటే మరోసారి విత్తనాలు వేసుకుందామనే ఆలోచనలో ఉన్నారు. మరికొంత మంది వేచిచూసే ధోరణిలో ఉన్నారు. అకాల వర్షాల నుంచి నష్టం తగ్గించేందుకు ఈ ఏడాది నుంచి ముందస్తు సాగును ప్రోత్సహించాలని భావించినా వాతావరణం అనుకూలించలేదు. సమృద్ధిగా వర్షాలు కురిసి నేలలో తేమ పెరిగిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

వాన కోసం ఎదురుచూపులు..
సాధారణంగా తొలకరి వర్షాలు జూన్ మొదటి వారంలోనే ప్రారంభమవుతాయి. తొలకరి జల్లులతో ఏరువాక పనులకు అన్నదాతలు సంసిద్ధమవుతుంటారు. ఇప్పటివరకు వర్షాలు జాడ లేదు. గతేడాది జూన్ 14 వరకు జిల్లాలో 1.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది కేవలం 0.9 ఎం.ఎం. వర్షపాతం మాత్రమే నమోదైంది. ఈ నెల 15 నుంచి 18 మధ్య నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి విస్తరిస్తాయని అధికారులు భావించారు. ఆరేబియా సముద్రంలో ఏర్పడిన బిపోర్‌జాయ్ తుపాను కారణంగా రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ కారణంగా మరో వారం రోజులపాటు వర్షాలు కురిసే పరిస్థితి ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

వర్షం పడ్డాకే విత్తనాలు వేసుకోవాలి

మంచి వర్షం పడ్డాకే విత్తనాలు వేసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాలు వేసుకుంటే మొలకలు వచ్చినా వేడికి చనిపోతాయి. జిల్లాలో కొంత మంది వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంది. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీనివాసరావు,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు


కేసీఆర్ కిట్లు అందజేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు


వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ఘనంగా వైద్యారోగ్య దినోత్సవం
- జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు వైద్యారోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీఎంహెచ్‌వో రామకృష్ణతో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలంటే ప్రజలు భయపడే వారని, ప్రస్తుతం వసతులు మెరుగుపడడంతో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, అమ్మఒడి పథకం ద్వారా తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటికి పంపించే వరకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గర్భిణులకు కేసీఆర్ కిట్లతోపాటు ఆడపిల్ల పుడితే రూ.13,500, అబ్బాయి పుడితే రూ.12,500 అందిస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, అద్దాలు అందిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలతో పాటు 350 పడకల జిల్లా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో వైద్య రంగంలో నూతన ఒరవడిని సృష్టించడం జరిగిందన్నారు. కిడ్నీ బాధితుల కోసం జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్తమ వైద్య సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, ఆరోగ్య కార్యకర్తలకు బీపీ ఆపరేటర్ మిషన్లు, యూనిఫాంలు, ఆశ కార్యకర్తలకు యూనిఫాం, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు.

డయాలసిస్ కేంద్రం ప్రారంభం
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు నాగేశ్వర్‌రావు, అజయ్‌కుమార్, చంద్రశేఖర్, దుర్పతబాయి, ఎంపీపీలు మల్లికార్జున్, విమలాబాయి, శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునచారి తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 24న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలో సీఎం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనం, ఎస్పీ కార్యాలయం, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ భవనంతో పాటు ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు సీఎం నిర్వహిస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

- డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ సమయానికి రక్తం లభించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారికి రక్తశిబిరాల్లో సేకరించే రక్తం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 60 మంది రక్తదానం చేసినట్లు వెల్లడించారు. రక్తదానం చేసిన వారికి ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వోలు అప్పలకొండ, శ్రీనివాస్, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాతకు పండ్లు అందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి డీపీవో సురేందర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పీఆర్సీలో నిర్ణయించిన కనీస వేతనం చెల్లించాలని, జీవో నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీల్లో అవసరాలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మట్ల రాజు, సీహెచ్ శంకర్, సమ్మయ్య, మల్లేశ్, లక్ష్మణ్, నవీన్, మహేశ్, రాజు, ప్రభాకర్, సాగర్, పద్మ, లక్ష్మి, పెంటుబాయి తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేజీబీవీల్లో నాణ్యమైన విద్య

- డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో బాలికలకు మెరుగైన విద్య అందుతోందని డీఈవో అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో బుధవారం కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ కేజీబీవీల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. బాలికలకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అవగాహన కల్పించి అడ్మిషన్లు పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో అశోక్

'రిజిస్ట్రేషన్' అక్రమాలకు చెక్!

- ఇక అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- స్టాంపుల విక్రయాలు సైతం..
- మాన్యువల్ విధానానికి స్వస్తి
- ఏ రోజు రిజిస్ట్రేషన్లు ఆ రోజే పూర్తి
- తొలిరోజు మొరాయించిన సర్వర్

కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాల కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇన్నాళ్లు మాన్యువల్‌గా సాగిన రిజిస్ట్రేషన్ వ్యవహారాలతో పాటు స్టాంపుల విక్రయాలకు పూర్తిగా స్వస్తి పలికింది. స్టాంపు వెండర్లు బహిరంగ మార్కెట్‌లో నేరుగా విక్రయించడాన్ని నియంత్రించిన సర్కారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశాకే వాటిని విక్రయించేలా ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్లు సైతం ఏ రోజుకారోజు పూర్తయ్యేలా సబ్‌రిజిస్ట్రార్లకు సైతం బయోమెట్రిక్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అక్రమాలకు పూర్తిగా చెక్‌పడటంతో పారదర్శకత పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్..
జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అనుమతి పొందిన స్టాంప్ వెండర్లకు సబ్ రిజిస్ట్రార్ల మాదిరిగానే వారికి ప్రత్యేక లాగిన్ ఇవ్వడంతో పాటు యూజర్ ఐడీ, పాస్‌వర్డు కూడా కేటాయించారు. వారు ఆ లాగిన్ ద్వారా సబ్‌రిజిస్ట్రార్ల నుంచి స్టాంపుల విక్రయాలు చేపట్టాల్సి ఉంటుంది. బాండ్ పేపర్లు సైతం ఇదే విధానంలో అమ్మనున్నారు. దీంతో రోజువారీగా ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఎన్ని స్టాంపులు, బాండ్ పేపర్లు విక్రయించారనే లెక్క పక్కాగా తేలనుండటంతో పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.


ఆన్‌లైన్‌లోనే స్టాంపుల విక్రయాలు..
స్టాంపులు, బాండ్ పేపర్ల విక్రయాల్లో అనేక అక్రమాలు జరుగుతున్నట్లుగా గుర్తించిన ప్రభుత్వం వాటి కట్టడికి చర్యలు చేపట్టింది. గతంలో బహిరంగ మార్కెట్‌లో స్టాంపులను నేరుగా విక్రయించారు. పాత తేదీలు వేసి అక్రమాలకు పాల్పడేవారు. ఇలాంటి వాటిని నియంత్రించాలని ప్రభుత్వం ఆన్‌లైన్ విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలో 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా వీటి పరిధిలో 131 మంది స్టాంపు వెండర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఆన్‌లైన్‌లో స్టాంపులు, బాండ్లు విక్రయించేందుకు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలి.


సర్వర్‌డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేచిచూస్తున్న జనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వివరాలు

జిల్లా	సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	తొలిరోజు రిజిస్ట్రేషన్లు
ఆదిలాబాద్	ఆదిలాబాద్, బోథ్	45
నిర్మల్	నిర్మల్, ఖానాపూర్, భైంసా	21
మంచిర్యాల	మంచిర్యాల, లక్సెట్టిపేట	31
కుమురంభీం	ఆసిఫాబాద్	04

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంప్ వెండర్ల సంఖ్య : 131



సబ్ రిజిస్ట్రార్లకూ బయోమెట్రిక్
రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వ్యవహారాలను సైతం ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశించిన ప్రభుత్వం సబ్‌రిజిస్ట్రార్లకు కూడా బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ప్లాట్లు, ఇండ్లు, భూముల రిజిస్ట్రేషన్ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు డాక్యుమెంట్స్‌ను అందజేసి, ఫొటో దిగిన తర్వాత ఇదివరకు సబ్ రిజిస్ట్రార్లు చెక్ స్లిప్‌లను తీరిగ్గా పరిశీలించి రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించేవారు. కానీ ఇప్పుడలా కుదరదు. ఫొటో దిగిన వెంటనే సబ్‌రిజిస్ట్రార్ తనకు కేటాయించిన ఐడీ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్స్‌ను పరిశీలించి అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఏ రోజు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆ రోజే పూర్తయ్యే అవకాశం కలుగుతుంది. బుధవారం నుంచే ఈ విధానం అమల్లోకి రావడంతో సర్వర్ డౌన్ సమస్య తలెత్తింది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తీవ్రంగా నిరీక్షించాల్సి వచ్చింది. తొలిరోజున అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగలేదు.

సెల్‌ఫోన్ ద్వారా కూడా దరఖాస్తు
స్టాంప్‌లను కొనుగోలు చేయాలనుకునేవారు సెల్‌ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం మొబైల్‌లో టీయాప్ పోలియో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలోకి వెళ్లాలి. స్టాంప్స్‌పై క్లిక్ చేసి తమకు అవసరమైన వాటి వివరాలు నమోదు చేసి డబ్బులు చెల్లించాలి. సంబంధిత స్లిప్‌తో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి స్టాంపులను కొనుగోలు చేయవచ్చు.

పారదర్శకత పెరుగుతుంది



రిజిస్ట్రేషన్ శాఖ వ్యవహారాలన్నింటినీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే ఆన్‌లైన్‌లో స్టాంపులు, బాండ్లను విక్రయించేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాత తేదీల్లో విక్రయించేందుకు అవకాశముండదు. సబ్ రిజిస్ట్రార్లకు సైతం బయోమెట్రిక్ అమలు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో పనులు త్వరగా పూర్తికావడంతో పాటు పారదర్శకత పెరగనుంది.

– అశోక్, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్ నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.4 (బసంత్‌నగర్) గ్రామానికి చెందిన ముకేశ్ మండల్ (32) ఇంటికి వెళు తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ట్రాలీ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి అజిత్ మండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో ట్రాలీ డ్రైవర్ ముత్తుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై దాడి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి ప్రాంతానికి చెందిన గుమ్మల పార్వతిపై ఇద్దరు వ్యక్తులు మంగళవారం రాత్రి ఇనుపరాడ్లతో దాడి చేసినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు. పార్వతి కుమారుడు రాకేష్ అదే ప్రాంతానికి చెందిన తోకల రాజమ్మ మనుమరాలిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడని అయితే పెళ్లి ఇష్టం లేని రాజమ్మ ఆమె కుమారుడు రాజశేఖర్ గుమ్మల పార్వతితో ఇటీవల గొడవలకు దిగుతున్నారన్నారు. ఈ క్రమంలోనే దాడి చేశారని వివరించారు. మహిళ ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి ఏడాది జైలు, జరిమానా

చెన్నూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి సంపత్ తీర్పునిచ్చినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. 2018 జూన్ 1న ముత్తెరావుపల్లె గ్రామానికి చెందిన రాజబాబు, కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన గడిపెల్లి బానయ్య ట్రాక్టర్‌పై వెళ్తుండగా చెన్నూర్ మండలం అక్కెపెల్లి గ్రామశివారులో వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రాజబాబు భార్య రాంశెట్టి రజిత ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ దార పరమేశ్‌పై కేసు నమోదు చేసి సాక్షులను ప్రవేశపెట్టగా బుధవారం శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దుమ్మ శివన్న(47) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని యావత్మాల్‌కు వెళ్లాడు. బుధవారం తలనొప్పి బాధ భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు దుమ్మ శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చినుకుపడితే.. ఎటోళ్లటే

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): వర్షాకాలం వస్తుందంటేనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ఆదివాసీల్లో గుబులు రేకెత్తుతోంది. వానాకాలం వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో బాహ్యప్రపంచంతో వారికి సంబంధాలు తెగిపోతాయి. వాగులపై వంతెనలు లేకపోవడంతో మండల, జిల్లా కేంద్రానికి రావాలంటే ఇక్కట్లు తప్పవు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. విషజ్వరాలు, క్రిమికీటకాల కాటుకు గురైనవారు, గర్భిణులను ఆస్పత్రులకు తరలించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(జే), వంకతుమ్మ, ముసల్‌పాడ్, లేండిగూడ, రాజులగూడ, కెస్లాగూడ, ఉమాపతికుంట, తదితర గ్రామాలతో పాటు నార్నూర్ మండలంలోని బారిక్‌రావుగూడ, ధన్నుగూడ, చిట్టగూడ, గాదిగూడ మండలంలోని కునికాసా, గణేశ్‌పూర్, ఇంద్రవెల్లి మండలంలోని జైత్రాంతాండ, చిత్తబట్ట, గోపాల్‌పూర్‌గూడ, మామిడిగూడ, జెండాగూడ, నిర్మల్ జిల్లా కడెం మండలంలోని అల్లంపల్లి, విద్దెచింత, గంగాపూర్, ఇస్లాంపూర్, కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని లక్మాపూర్, కరంజివాడ, జంకాపూర్, శంకర్‌లొద్ది గ్రామాల్లో నేటికీ సరైన రోడ్లు, వాగులపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానాఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు, వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.



వంకతుమ్మ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి (ఫైల్)



వంకతుమ్మ వాగు దాటి వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)



నర్సాపూర్(జే)కు వెళ్లాలంటే ఇలా అవస్థలు పడాల్సిందే(ఫైల్)



పొంగిపొర్లుతున్న లక్సెట్టిపేట వాగు (ఫైల్)

నిఘా నీడలో అడవి

- జన్నారం అటవీ డివిజన్‌లో 126 కెమెరాలు ఏర్పాటు
- నిత్యం పరిశీలన
- నెలకోసారి కంప్యూటర్‌లో ఫొటోలు డౌన్‌లోడ్


జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ నిఘా నీడలో ఉంది. అడవులు, వన్యప్రాణులను నిత్యం పరిశీలించేందుకు అడవిలో అటవీశాఖ అధికారులు సీసీకెమెరాలు అమర్చారు. వాటికి చిక్కిన వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం అటవీ డివిజన్ 21 శాతం విస్తరించింది. ఈ డివిజన్‌లో 40 అటవీ బీట్‌లు, 14 అటవీ సెక్షన్‌లు, మూడు అటవీరేంజ్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ నిత్యం డివిజనల్ ఫారెస్ట్ అధికారి స్మార్ట్, విజిలెన్స్, స్మార్ట్ వర్క్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తారు. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లో నీటికుంటలు, గడ్డి క్షేత్రాలు, దట్టమైన ప్రాంతాలు, ప్రధాన ప్రదేశాల్లో 126 కెమెరాలు అమర్చారు.

నెలకోసారి పర్యవేక్షణ

అడవిలో అమర్చిన కెమెరాల్లోని మెమొరీకార్డులను నెలకోసారి తీసి కంప్యూటర్‌లో చిత్రాలను డౌన్‌లోడ్ చేస్తారు. వీటి ద్వారా వన్యప్రాణుల సంఖ్య, వాటి ఆరోగ్య పరిస్థితి, అడవిలో పశువులు, మనుషుల కదలికలు, తదితర అంశాలను పరిశీలించి వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. అడవిలో ఉండే బేస్‌క్యాంప్ సిబ్బంది కెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. రెండురోజులకసారి బీట్ అధికారి, వారం రోజులకోసారి రేంజ్ అధికారి కెమెరాల నిర్వహణపై పరిశీలన జరుపుతారు.



అడవిలో అమర్చిన సీసీ కెమెరా



కెమెరాకు చిక్కిన అడవిదున్నలు

మార్చిలో కెమెరాలకు చిక్కిన వన్యప్రాణులు

- ఆరు ప్రదేశాల్లో 18 చిరుతపులులు కెమెరాకు చిక్కాయి.
- 21 కెమెరాల్లో వందకుపైగా అడవిబర్రెలు చిక్కాయి.
- రెండు కెమెరాలకు ఐదు కృష్ణజింకలు చిక్కాయి.
- 40 కెమెరాల్లో 180 సాంబార్‌లు చిక్కాయి.
- వంద కెమెరాల్లో 350కి పైగా చుక్కల దుప్పులు చిక్కాయి.
- 90 కెమెరాల్లో 210కి పైగా నీలుగాయిలు చిక్కాయి.
- 20 కెమెరాల్లో 12 ఎలుగుబంట్లు చిక్కాయి.
- 3 కెమెరాల్లో పదికిపైగా తోడేళ్లు చిక్కాయి.
- 3 కెమెరాల్లో పది వరకు నక్కలు చిక్కాయి.
- 6 కెమెరాల్లో 50కి పైగా కొండగొర్లు చిక్కాయి.
- 9 కెమెరాల్లో 23 వరకు గడ్డి జింకలు చిక్కాయి.
- 8 కెమెరాల్లో 25 హనీ బడ్జెర్ (తేనె కుక్కలు) చిక్కాయి
- 15 కెమెరాల్లో 25 వరకు పునుగు పిల్లులు చిక్కాయి.
- 6 కెమెరాల్లో 30 ముళ్ల పందులు చిక్కాయి.
- 8 కెమెరాల్లో 28 అడవి పిల్లులు చిక్కాయి.
- 110 కెమెరాల్లో 800కు పైగా అడవి పందులు చిక్కినట్లు అధికారులు తెలిపారు.

పర్యవేక్షణ సులువు



మారుతున్న కాలానికి అనుగుణంగా అడవులు, వన్యప్రాణులను పర్యవేక్షణ చేయడానికి జన్నారం డివిజన్‌లో 126 చోట్ల కెమెరాలు అమర్చాం. వీటిని ప్రతీరోజు బేస్‌క్యాంప్ సిబ్బంది పరిశీలిస్తారు. నెలకోసారి కెమెరాలోని మెమొరీకార్డులోంచి డాటాను డౌన్‌లోడ్ చేస్తాం. వీటిద్వారా వన్యప్రాణుల వివరాలు, వాటి ఆరోగ్య పరిస్థితులు గమనిస్తాం. పర్యవేక్షణ సులువుగా ఉంటుంది.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

- విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్



విద్యార్థులతో జేడీ రాజీవ్, డీఈవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పిలుపునిచ్చారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యా సంవత్సరం ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, నోట్‌బుక్స్‌తో పాటు అల్పాహారం కింద రాగిజావ, వారానికి మూడు కోడిగుడ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పోషక విలువలున్న భోజనం అందిస్తున్నామన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పూర్తి స్థాయి వసతులు కల్పిస్తూ కార్పొరేట్‌కు దీటుగా తయారుచేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా సెక్టోరియల్ అధికారులు కె.చౌదరి, ఏ.సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి జాడి పోచయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



హాజరైన కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది చివరన జరుగనున్న ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 23 నుంచి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని, నూతనంగా ఓటుహక్కు పొందిన వారికి పోస్టల్ శాఖ ద్వారా ఓటు గుర్తింపు కార్డు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గత ఎన్నికల్లో సగటు కంటే తక్కువగా పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, తప్పుడు వదంతులు వ్యాపింపజేసే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, ఆర్డీవో వేణు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని కర్లలఘటం అటవీప్రాంతంలో బుధవారం అటవీశాఖ సిబ్బంది గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజశేఖర్ ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు దాదాపు పది నుంచి ఇరవై రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, 35 నుంచి 45 ఏళ్ల వయస్సు మధ్యలో ఉంటాడన్నారు. నీలం రంగు లుంగీ, ఆకుపచ్చ, నీలం గీతలతో ఉన్న చొక్కా ధరించి ఉన్నాడని, ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలని ఎస్సై కోరారు. ఫారెస్టు బీట్ అధికారి చందా యుగందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మరణంలోనూ వీడని బంధం



సంఘటన స్థలంలో లక్ష్మి, శంకరయ్య మృతదేహాలు



లక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఘటన

లక్సెట్టిపేట: కడవరకూ తోడుంటానని పెళ్లినాటి ప్రమాణాలు ఆ దంపతుల విషయంలో నిజమయ్యాయి. సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయి స్వగ్రామంలో శేషజీవితం గడిపేందుకు వచ్చాడు. ఇల్లు నిర్మించుకుని భార్య, పిల్లలు, మనుమలు, మనుమరాళ్లతో హాయిగా జీవనం సాగిస్తున్నాడు. వారిని చూసి విధికి కన్నుకుట్టినట్లు ఉంది. బంధువుల వివాహానికి వెళ్లి వస్తుండగా, లారీ మృత్యువు రూపంలో వచ్చి ఆ దంపతులను కబళించింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో బుధవారం జరిగింది. దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లి గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య(65), లక్ష్మి(60) దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. శ్రీరాంపూర్‌లో సింగరేణి ఉద్యోగం చేస్తూ ఇద్దరికి వివాహం చేశారు. నాలుగేళ్ల క్రితం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ విరమణ పొంది చిన్నకూతురు శిరీష భర్త సుభాష్‌కు తన ఉద్యోగాన్ని ఇచ్చాడు. తర్వాత స్వగ్రామం మ్యాదరిపేటకు వచ్చి ఇల్లు నిర్మించుకుని తన శేషజీవితం సంతోషంగా గడుపుతున్నాడు. మంచిర్యాల సమీపంలోని వేంపల్లి గ్రామం వద్ద బుధవారం బంధువుల వివాహానికి దంపతులు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. నవ దంపతులను ఆశీర్వదించి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. మార్గం మధ్యలో గుల్లకోట గ్రామ స్టేజీ వద్ద దాహం కావడంతో ఆగారు. మంచినీళ్లు తాగి తిరిగి బయల్దేరుతుండగా, వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాలను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

అంత్యక్రియలు నిర్వహించిన పెద్దకూతురు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పెద్దకూతురు

దండేపల్లి: రోడ్డు ప్రమాదంలో బత్తుల శంకరయ్య–లక్ష్మి దంపతుల మృతితో మండలంలోని కొత్తమామిడిలో విషాదం నెలకొంది. ఒకేసారి తల్లిదండ్రులు మృతిచెందడంతో కూతుళ్లు తిరుమల, శ్రీలత, శిరీష కన్నీరుమున్నీరుగా విలపించారు. సాయంత్రం గ్రామంలో శంకరయ్య–లచ్చవ్వ దంపతుల అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దకూతురు తిరుమల తల్లిదండ్రులిద్దరికీ తలకొరివి పెట్టింది.

లైంగిక దాడికి యత్నించిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బుద్దె స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కాగజ్‌నగర్‌టౌన్ సీఐ బుద్దె స్వామి తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలో బాలికపై అత్యాచారయత్నం జరిగిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇంటి ముందు కూర్చున్న బాలికను రాత్రి 11 గంటలకు నిందితులు అభిలాష్ (21), విజయ్ (20) వారి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



హాజరైన అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత కల్పించామన్నారు. మొదటి రోజు 500 మంది అభ్యర్థులకు గానూ 445 మంది హాజరుకాగా 55 మంది గైర్హాజరయ్యారన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీ.సమయ్‌జాన్‌రావు, ఏవో యునూస్ అలీ, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీల నియామకం పారదర్శకంగా చేపట్టాలి



ఏపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో సీఆర్టీల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ బుధవారం ఐటీడీఏ ఏపీవో భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్తీ ప్రక్రియ రహస్యంగా కాకుండా మెరిట్ జాబితాను బహిరంగ పర్చి అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. ఎంపిక పరీక్షకంటే ముందే ఏఏ సబ్జెక్టుల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సంఘం నాయకులు మెస్రం రాజు, కోట్నాక్ లక్ష్మణ్, భూమేశ్, తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన చిలుకూరి మల్లేశ్ (45) తనకున్న భూమిని అమ్మి 2020లో కూతురు వివాహం చేశాడు. దీంతో పాటు అతని భార్య అనారోగ్యానికి గురైంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బయటకు వచ్చి అతని తమ్మునితో చెప్పడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.